# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

సోమవారం, మార్చి 25, 2013

పంతొమ్మిదవ సమావేశము, సంపుటము I I, నంబరు. 4

నందననామ సం. ఫాల్గుణ శు. 13

**MONDAY, THE 25TH MARCH, 2013**

**NINETEENTH SESSION, VOLUME I I, NO. 4**
**4TH CHAITRA, 1934 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

# LEGISLATURE SECRETARIAT,
# PUBLIC GARDENS,
# HYDERABAD - 500 004.

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | ః | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | ః | శ్రీ నేతి విద్యాసాగర్ |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | ః | శ్రీ మహమ్మద్ జానీ |
| | | శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి |
| | | శ్రీ బి. చెంగల్‌రాయుడు |
| | | శ్రీ బి. వెంకటేశ్వర్లు |
| **కార్యదర్శి** | ః | డా. ఎస్. రాజ సదారామ్ |
| **ఉప కార్యదర్శులు** | ః | శ్రీమతి వి. గిరిజాసుందరి |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ జి. వెంకటక్రిష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| | | శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| **సహాయ కార్యదర్శులు** | ః | శ్రీ వి. నరసింహాచార్యులు |
| | | శ్రీమతి టి. సుశీల |
| | | శ్రీ జె. రామలింగేశ్వర్ రావు |
| | | శ్రీ హెచ్.ఎ. షఫీ |
| | | శ్రీ ఎమ్. విజయ రాజు |
| | | శ్రీ వి. రమేష్ కుమార్ |
| | | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ టి.బి. జయచందర్ |
| | | శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ |
| | | శ్రీ సూరజ్ బహదూర్ |
| | | శ్రీ కె. రాజ్‌కుమార్ |

|  |  |  |
|---|---|---|
|  |  | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |
|  |  | శ్రీ ఎస్. రామనరసింహం |
|  |  | శ్రీమతి  టి. సత్యవేదకుమారి |
|  |  | శ్రీమతి  ఎ. చంద్రభాగ |
| **మార్షల్** | ః | శ్రీ  సి.హెచ్.వి. శెట్టి |
| **చీఫ్ రిపోర్టర్** | ః | శ్రీమతి  పి. శివదీక్ష |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

**సోమవారం,  మార్చి 25,  2013**

**అధికార నివేదిక**

**విషయ సూచిక**

సభా కార్యక్రమం ః

1. శ్రీ పొగాకు యాదగిరి, యం.యల్.సి. గారి మృతిపై సంతాప తీర్మానం.

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## 2013, మార్చి 25వ తేది, సోమవారం

## పంతొమ్మిదవ సమావేశపు పదవ రోజు

**(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది. గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

- - -

శ్రీ పొగాకు యాదగిరి, యం.యల్.సి. గారి మృతిపై సంతాప తీర్మానం.

మిస్టర్ ఛైర్మన్ ః సిట్టింగ్ మెంబర్ శ్రీ పొగాకు యాదగిరి గారి అకాల మరణం మనందరికి తెలిసిందే. ఇది చాలా బాధాకరమైన విషయం. ఇందుకు సంతాప తీర్మానాన్ని చేసుకుందాం. లీడర్ ఆఫ్ ది హౌస్ శ్రీ రామచంద్రయ్య గారు ఇప్పుడు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి, మాట్లాడతారు.

శ్రీ సి. రామచంద్రయ్య ః ( అసెంబ్లీ )

## <u>సంతాప తీర్మానం</u>

" ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్తు సభ్యులు శ్రీ పొగాకు యాదగిరి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది".

అధ్యక్షా, యాదగిరి గారు నాకు చాలా మంచి మిత్రులు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఒక ఫౌండర్ మెంబర్‌గా ఉన్నారు. ఒక సామాన్య కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని మొదలు పెట్టి శాసన పరిషత్తు సభ్యునిగా ఎదగడం జరిగింది. అతనిలో ఒక గొప్ప స్పెషాలిటీ ఏమిటంటే.. పెరిగే కొద్దీ నమ్రత, విధేయత చాలా ఎక్కువగా కనిపించేవి. రాజకీయాలలోకి రాకముందు ప్రాక్టీసింగ్ అడ్వకేట్‌గా ఉండేవారు. రాజకీయాలలోకి వచ్చిన మొదట్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఉండేవారు. తరువాత స్వర్గీయ ఎన్.టి. రామారావు గారు తెలుగుదేశం పార్టీని పెట్టిన తరువాత ఆయన భావాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఆఫీసు ఇన్-ఛార్జ్‌గా దాదాపు ఏడెనిమి సంవత్సరాలు పని చేశారు. నేను అతని అనారోగ్యం గురించి ఒక వారం రోజుల క్రితమే కలిసి పరామర్శించే అదృష్టం కలిగింది. ఇంత త్వరగా పరమపదిస్తారని నేను ఊహించలేదు. మంచి ట్రీట్‌మెంట్ కూడా తీసుకుంటున్నారు. ట్రీట్‌మెంట్‌కోసం రెండు, మూడు సార్లు ముంబాయికి వెళ్లడం జరిగింది. అతని ట్రీట్‌మెంట్‌కు ప్రభుత్వం కూడా మంచి సహాయం చేసింది. కమిట్‌మెంట్, కన్విక్షన్ ఉన్నటువంటి వ్యక్తి

అయన. నీతి, నిజాయితీతో, నిబద్ధతతో, నైతిక విలువలతో రాజకీయాలలో ఎదిగిన వ్యక్తి యాదగిరి గారు. రాజకీయాలలో కలిసి పెరిగాం కాబట్టి మా ఇద్దరికి చాలా సన్నిహిత సంబంధం ఉండేది. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చినా కూడా ఆయన చాలా కష్టాలు పడ్డారు. చాలా నైతిక విలువలు ఉన్నటువంటి వ్యక్తి శాసన పరిషత్తు సభ్యుడిగా రెండు సార్లు ఎన్నిక కావడం జరిగింది. యాదగిరి గారి మృతి పట్ల నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాను. వారి కుటుంబ సభ్యులకు కూడా నా సానుభూతిని తెలుపుతూ అతని ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు (స్థానికసంస్థలు) : అధ్యక్షా, ఈ చట్ట సభలో రెండవ సిట్టింగ్ సభ్యులు మరణించడమనేది చాలా దురదృష్టకరమైన విషయం. గతంలో రాజ్యలక్ష్మి గారు మరణించారు. యాదగిరి గారు రెండవ పర్యాయం శాసన పరిషత్తుకు ఎన్నికయ్యారు. గతంలో 1982వ సంవత్సరంలో ఎన్.టి.రామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు పార్టీలో చేరి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా, జిల్లా పార్టీ అధ్యక్షులుగా కూడా ఆయన పనిచేయడం జరిగింది. తరువాత 1983వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత శాసన పరిషత్తులో కేవలం నాలుగైదు సీట్లకు మాత్రమే తెలుగుదేశానికి అవకాశం వచ్చింది. వాటిల్లో రావుగోపాలరావు గారి లాంటి వారిని ఎంపిక చేసిన సమయంలో యాదగిరి గారిని కూడా ఎం.ఎల్.సీగా ఎంపిక చేసి పంపడం జరిగింది. తరువాత పార్టీ ఆఫీసుకు వచ్చే సభ్యులందరిని కూడా ఆదరించడానికి పార్టీలో రిసెప్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు ఆయనకు అప్పగించడం జరిగింది. ఆరు సంవత్సరాల క్రితం శాసన పరిషత్తు పునరుద్ధరింపబడిన తరువాత చంద్రబాబునాయుడు గారు యాదగిరి గారికి ఎం.ఎల్.సీగా మరొక అవకాశం ఇవ్వడం, ఆ అవకాశానికి సభ్యులు సహకరించి మద్దతు తెలిపి అతనికి ఓటు వేయడం జరిగింది. ఎం.ఎల్.సీగా మాత్రమే కాకుండా, అంతకుముందు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా, అధికార భాషా సంఘం సభ్యునిగా కూడా వారు పని చేయడం జరిగింది. శాసన పరిషత్తులో కూడా భాషకు సంబంధించినటువంటి ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా.. చక్కని భాషతో తెలుగు గురించి, సాహిత్యం గురించి మాట్లాడిన విషయం సభ్యులందరికీ తెలుసు. అదే విధంగా, ప్రజా సమస్యల గురించి నిర్మొహమాటంగా సభలో లేవనెత్తడం, వాటి గురించి ఫైట్ చేయడం వంటివన్నీ జరిగాయి. మాకు కూడా ఏమైనా సలహాలు కావాలంటే ఇచ్చేవారు. ఫలానా ప్రజా సమస్యలను టేకప్ చేస్తే బాగుంటుందని చాలా ప్రాపర్‌గా ఆయన మాకు సలహాలు ఇవ్వడమనేది జరిగేది. వెనుకబడిన తరగుతుల నుండి వచ్చిన యాదగిరి గారు తన పదవిని ఏనాడూ దుర్వినియోగం చేయకుండా గౌరవ ప్రదంగా నిర్వహించడం జరిగింది. యాదగిరి గారి మరణం చాలా దురదృష్టకరం. వారి వల్ల ప్రధానంగా తెలుగుదేశం పార్టీకి ఎక్కువ లాభం ఉన్నటువంటి పరిస్థితిలో వారి అకాల మరణం పార్టీకి నష్టాన్ని కలుగజేయడం జరిగింది.

10.10AM

యాదగిరి గారి మరణం ఈ సభకు కూడా తీరని లోటు. వారి పదవీకాలం కూడా ఈ నెల 29వ తేదీతో పూర్తవుతుంది. ఈ సందర్భంగా వారు మరణించడం అందరికీ బాధాకరమైన విషయం. వారి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబసభ్యులకు ఓదార్పు కలుగజేయాలని కోరుకుంటున్నాను.

శ్రీ జల్లీ విల్సన్ ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, సిట్టింగ్ సభ్యులైనటువంటి శ్రీ పొగాకు యాదగిరి గారు మరణించారనే వార్త తెలియగానే మాకు చాలా బాధ కలిగించింది. నాతోపాటు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎంపిక అయినప్పటినుండి ఈ ఆరు సంవత్సరాల కాలంలో వారు సభలో ప్రతి విషయంలోనూ తన యొక్క పార్టీ విధానాన్ని ప్రతిబింబిస్తూ, ప్రతి అంశంలోనూ ఆయన స్పందించిన తీరు ఎవరూ మరచిపోలేనిది. ముఖ్యంగా ఆయన తెలుగుదేశం పార్టీ నాయకునిగానే కాకుండా బయట జరిగే రైతాంగ ఉద్యమాలు, ఐక్య ఉద్యమాలు, గ్రామీణ కష్టజీవుల యొక్క సమస్యల పట్ల స్పందించిన తీరు, ఆయన నడిపినటువంటి కార్యాచరణ అందరికీ ఆదర్శనీయమైనటువంటిది. అటువంటి వ్యక్తి చనిపోవడమనేది శాసనమండలికి లోటేనని చెప్పక తప్పదు. నమ్రత, మర్యాద కలిగినటువంటి ప్రజాప్రతినిధి శ్రీ పొగాకు యాదగిరి. వారి మరణం పట్ల మా పార్టీ తరపున వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, మిత్రులు శ్రీ పొగాకు యాదగిరి గారి మరణం నాకు చాలా దిగ్భ్రాంతిని కలిగించింది. వారి వయస్సు 62 సంవత్సరాలు. వయసు రీత్యా ఇంకా చాలా కాలం పనిచేసే అవకాశం ఉన్న నాయకులు. అట్టడుగు వర్గాల నుండి కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ఏ పని అప్పజెపితే ఆ పనిని ఒక సైనికుడిగా అంకితభావంతో పనిచేసేవారు. సభలో కూడా చాలా సందర్భాలలో పోడియం వద్దకు వచ్చి కూర్చుని నినాదాలు ఇచ్చేవారు. నినాదాలలో మంచి దిట్ట. ఆయన లేని లోటు బాగా కనబడుతోంది. చాలాకాలంనుండి ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఆ పార్టీ ఏ కార్యక్రమం ఇస్తే దానిని తు.చ. తప్పకుండా పాటించే వ్యక్తి ఆయన. వారు నేను పేపర్స్ లెయిడ్ కమిటీలో కలిసి పనిచేయడం జరిగింది. పదిరోజులు అస్సాం, డార్జిలింగ్, సిక్కిం వంటి ప్రాంతాలు వారి కుటుంబ సభ్యులతో, మా కుటుంబ సభ్యులమంతా కలిసి వెళ్లడం జరిగింది. తరువాత కూడా మా కుటుంబాల మధ్య సాన్నిహిత్యం పెరిగి చాలా సన్నిహితంగా మెలిగేవాళ్లము. దురదృష్టవశాత్తు నేను నిన్నటి దహనసంస్కార కార్యక్రమానికి వెళ్లలేకపోయాను. యాదగిరి గారు లేని లోటు తీవ్రంగా అగుపడుతున్నది. వారి మృతికి నా ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా. కె. నాగేశ్వర్ ( మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు ) ః శ్రీ పొగాకు యాదగిరి గారి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, తెలుగుదేశం పార్టీకి పి.డి.ఎఫ్ పార్టీ తరపున హృదయపూర్వక

సంతాపాన్ని తెలియచేస్తున్నాము. సభలో ఒక మంచి సహచరుని కోల్పోయాము. మా ఇద్దరిదీ ఒకే ఊరు. మా మేనమామగారికి ఆయన క్లాస్‌మేట్. చిన్నప్పుడు మా అమ్మమ్మగారింట్లో మేము రెగ్యులర్‌గా కలిసేవాళ్లము. మాతో వ్యక్తిగత అనుబంధం కలిగిన వ్యక్తిగా వారి మృతి మమ్మల్ని కలచివేస్తోంది. ఈ రోజుల్లో చాలామంది సంపన్నులు, ఆస్తిపరులు, అకస్మాత్తుగా రాజకీయాలలోకి ఊడిపడి పదవులను తెచ్చుకుంటున్న కాలంలో మనం ఉన్నాము. కానీ, యాదగిరిగారు విద్యార్థి దశలోనే ఒక మంచి విద్యార్థి నాయకుడిగా ఎదిగారు. మంచిర్యాల డిగ్రీ కళాశాల విద్యార్థి సంఘానికి తొలి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. విద్యార్థులను సమీకరించడంలో, వారిని ఆకర్షించడంలో యాదగిరిగారికి ఒక ప్రత్యేకమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. శాసన మండలిలో కూడా ఆయన నిలబడినా, మాట్లాడినా అందరినీ ఆకర్షించేవారు. ఈ లక్షణాలను ఆయన కళాశాల విద్యార్థి దశలోనే తెచ్చుకున్నారు. మరో ముఖ్యవిషయం ఏమిటంటే – పదవి ఇవ్వకపోతే పార్టీలో ఉంటారో లేదో అనే అనుమానం ఉన్న ఈ రోజులలో పదవి ఉన్నా లేకపోయినా తెలుగుదేశం పార్టీకి నిబద్ధతతో పనిచేశారాయన. పార్టీలేవైనా ఆయనను అభినందించాలి. తొలి శాసనమండలిలో సభ్యులైనారు. అప్పటినుండి మధ్యలో చిన్న చిన్న పదవులు తప్పిస్తే పెద్దగా పదవులు లేవు. అయినా తెలుగుదేశం పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేశారు. ఇది రాజకీయాలలో ఆహ్వానించదగ్గ లక్షణం అధ్యక్షా. తెలుగుదేశం పార్టీ పుట్టకముందు ఆయన తెలుగుదేశంలో చేరారు. శ్రీ ఎన్.టి.రామారావుగారు తెలుగుదేశం పార్టీ ప్రకటించకముందు మంచిర్యాల వచ్చి 50,60మంది యువకులతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం చాలామందికి తెలియదు. ఆ రకంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందునుండి ఆయన కట్టుబడి ఉన్నారు. శాసనమండలి పెట్టినప్పుడు ఆ తరువాత శాసనమండలికి పోటీ చేసినప్పుడు చాలామందికి గెలుస్తారా, లేదా అనే అనుమానం వచ్చినప్పుడు పార్టీకోసం ఓడినా మంచిదే అని పోటీచేయడానికి ముందుకు వచ్చారు. ఇది కూడా రాజకీయాలలో ఆహ్వానించదగ్గ అంశం. ఆ రకంగా ఎన్నికై తన పూర్తికాలంపాటు శాసనమండలిలో గడిపారు. ఆదిలాబాద్ జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ నాయకుడాయన. ఆ స్థాయిలో ఉండికూడా తరువాత ఆయన పార్టీకి చాలా అంకితభావంతో మెలగేవారు. ఏ బాధ్యత ఇచ్చినా అన్నింటికంటే పార్టీయే ముఖ్యమని భావించిన వ్యక్తి యాదగిరి గారు. రాజకీయాలలో ఇటువంటి లక్షణాలు కరవవుతున్న వేళ శ్రీ పొగాకు యాదగిరి లేని లోటు కనిపిస్తూ ఉంటుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇంతకుముందు ప్రధాన ప్రతిపక్షనాయకులు శ్రీ దాడి వీరభద్రరావు అన్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ఎవరైనా వెడితే ముందు కనిపించే వ్యక్తి యాదగిరిగారే. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆయన సెక్రటేరియట్‌లో కంటే పార్టీ కార్యాలయంలో ఎక్కువగా కనిపించేవారు. ఆయన నా కంటే దాదాపు 15 సంవత్సరాలు వయసులో పెద్దవారు. అయినా ఎంతో నమ్రత కలిగి ఉండేవారు. ఆయన ఎప్పుడు శాసనమండలిలో కలిసినా నన్ను 'అన్నా' అనేవారు. నేను నీకెట్లా అన్ననవుతాను, మామనవుతాను అనేవాణ్ణి. ఆ రకంగా మంచి మిత్రుడు, సహృదయుడు, పార్టీ రాజకీయాలలో ఒక నిబద్ధత కలిగిన వ్యక్తి. ఒక మంచి ప్రజాప్రతినిధిని మనం

కోల్పోయాము. మరోసారి యాదగిరి గారి మృతికి మా సభ్యులందరి తరపున సంతాపాన్ని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

10.20 AM

శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి ( స్థానికసంస్థలు ) : అధ్యక్షా, గౌరవ శాసనపరిషత్ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరి గారి మరణవార్త విన్న తర్వాత నేను చాలా షాక్‌కు గురయ్యాను. రద్దయిన శాసనపరిషత్తులో శ్రీ పొగాకు యాదగిరిగారు, నేను కలిసి పనిచేయడం జరిగింది. అదే విధంగా, ఈ శాసనపరిషత్తులో కూడా ఆయన, నేను కలిసి పనిచేసే అవకాశం దొరికింది. పార్టీలు వేరైనా, ఆయన నాకు చాలా మంచి మిత్రుడు. గత నాలుగైదు సంవత్సరాలనుంచి రెగ్యులర్‌గా మేము కలిసేవాళ్లం. సభ్యులు శ్రీ చేరుపల్లి సీతారాములు చెప్పినట్లుగా, మేమంతా కలసి టూర్లకు కూడా వెళ్లేవాళ్లం. వారం రోజుల క్రితం, శ్రీ పొగాకు యాదగిరిగారు నాకు ఫోన్ చేసి వారి కుమారుడు పెళ్లి సంబంధం విషయంలో నా సహాయాన్ని కోరడం జరిగింది. ఆ వివరాలను కూడా నేను వారికి ఇచ్చి కేవలం నాలుగైదు రోజులవుతోంది. ఇంతలోనే మేము మొన్న మహబూబ్‌నగర్‌లో ఉన్న సమయంలో మాకు ఈ న్యూస్ తెలిసింది. మనమంతా ఒక మంచి స్నేహశీలిని, మంచి మిత్రుడిని కోల్పోవడం జరిగింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ బి.చంగల్ రాయుడు (అసెంబ్లీ) : అధ్యక్షా, గౌరవ శాసనపరిషత్ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరిగారితో నాకు పరిచయం ఈ సభలోనే జరిగింది. గతంలో లెజిస్లేటర్స్‌కు మొదటి బ్యాచ్ ఎన్నికలు జరుగుతోన్న సందర్భంలో శ్రీ పొగాకు యాదగిరిగారు, శ్రీ నారాయణరావుగారు, శ్రీమతి మసాల పద్మజగారు, నేను కూర్చుని ఉన్నప్పుడు "కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ సభ్యులంతా గెలుస్తున్నాము, టి.ఆర్.ఎస్. పార్టీ తన ఓట్లన్నీ ఒకరికే వేసుకుంది కాబట్టి మీరు, మేము వర్రీ కావలసిన పనిలేదు" అని నేను చెబితే "నేను ఓడిపోతానని నన్ను ముందే గెలిపించేశావే అన్నా" అని ఆయన నాతో అన్నారు. ఫలితాలు కూడా ఆ విధంగానే వచ్చాయి. ఆరోజే నాకు ఆయనతో పరిచయం ఏర్పడింది. అంతకు ముందు నాకు ఆయనతో పెద్దగా పరిచయం లేదు. ఈ సభలో ఎక్కువగా స్లోగన్స్ ఇవ్వడంలో ఆయన దిట్ట. ఏదైనా ఉంటే ఆయన ముందుగా వెల్‌లోనికి వచ్చేవాడు. స్లోగన్ల యొక్క ప్రభావం ఎలా ఉంటుందని ఆయన కార్యాలయానికి వెళ్లి నేను స్వయంగా ఆయనను అడిగినపుడు "స్లోగన్ అనేది స్లోగా పనిచేసే గన్" అని, అంత డీప్‌గా పనిచేస్తుందని, ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా చేయవలసింది అదేనని, మేము కూడా గతంలో అదే విధంగా చేసేవారమని" నేను ఆయనను కన్విన్స్ చేద్దామని ఆయన కార్యాలయానికి వెళితే ఆయన నన్ను కన్విన్స్ చేయడం జరిగింది.

శ్రీ ధర్మాన ప్రసాదరావుగారు రెవెన్యూశాఖామంత్రిగా పనిచేసిన సమయంలో "సామాన్య జనం భూమిని కొంటే అమ్మినవారు కూడా సామాన్య వ్యక్తి అయితే దానిని లీగలైజ్ చేద్దామని" "బి.ఎస్.ఓ. సెక్షన్ 9" కు ఒక ప్రొహిబిటెడ్ ఆర్డర్‌ను తీసుకువస్తూ, ఒక చట్టాన్ని తీసుకురావడం జరిగింది. ఆ సందర్భంగా నేను సభలో మాట్లాడిన తర్వాత, సభ బయట శ్రీమతి నన్నపనేని రాజకుమారిగారి సమక్షంలో, "నీ అడ్వకేట్ బుద్ధి అంతా చూపించి అందర్నీ ఒప్పించే ప్రయత్నం చేశావని, కానీ, పాలకపక్షంలో ఉన్నటువంటి ప్రతిపక్ష సభ్యుడు, ప్రతిపక్షంలో ఉన్నటువంటి పాలకపక్ష సభ్యుడు ఇద్దరు ఉన్నారు, ఒకరు మీరు, రెండవది శ్రీ వెంకటరావుగారు" అని మాకొక కితాబుని కూడా శ్రీ పొగాకు యాదగిరి గారు మాకు ఇచ్చారు. పాలకపక్షంలో ఉన్నటువంటి ప్రతిపక్షం అనే పదాలను ఆయన ఉపయోగించినపుడు కొంచెం ఆనందం కలిగినా, కొన్ని నిజాలు మేము మాట్లాడుతున్నామని, సబ్జెక్టుపై కొన్ని విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నామనే గర్వం కూడా మాకు ఆనాడు కలిగింది.

శ్రీ పొగాకు యాదగిరిగారు శ్రీ వేంకటేశ్వరస్వామికి ఒక మంచి భక్తుడు. ఆయన ఎప్పుడు తిరుపతికి వచ్చినా మా ఇంటికి వచ్చి మమ్మల్ని కలిసి వెళ్లేవారు. ఆయన ఎప్పుడు మాట్లాడినా నన్ను "అన్నా" అని సంబోధించేవారు. వేరే పదాలు ఆయన ఉపయోగించేవారు కాదు. నెలరోజులక్రితం ఆయన ముఖ్యమంత్రిగారి పేషీ వద్ద నాకు కనిపించి ఈ విధంగా చెప్పాడు. "అన్నా, నాకు ఒక కోయదొర కనపడి 2014 వ సంవత్సరంలో మా పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పాడు." ఏ విధంగా వస్తుందని నేను అంటే, "మాపార్టీ అధికారంలో ఉండగానే నేను చనిపోతానన్నా" అని ఆయన నాతో అన్నాడు. పార్టీ అధికారంలో ఉండగా చనిపోవాలనే కోరికను ఆయన వెలిబుచ్చిన విషయాన్ని తమరిద్వారా సభ దృష్టికి నేను తీసుకువస్తున్నాను. ఆయన పార్థివదేహాన్ని చూసే భాగ్యం నిన్న నాకు కలిగింది. నిన్ననే ఆయన కుటుంబ సభ్యులను కూడా నేను స్వయంగా కలిసి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది.

"ఆయన పార్టీకి నమ్మినబంటని" ఇంతకుముందే పెద్దలు శ్రీ సి.రామచంద్రయ్య గారు చెప్పారు. ఆయన ఎంతో క్రమశిక్షణ కలిగిన కార్యకర్త. "నేను చనిపోతే, నా పార్థివ దేహంపై నా పార్టీ జెండా ఉండాలని కోరుకున్న వ్యక్తి" శ్రీ పొగాకు యాదగిరిగారు. అటువంటి వ్యక్తులు ఈ కాలంలో ఎంతమంది ఉన్నారు? వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తమరిద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ కనుకుల జనార్థన్‌రెడ్డి ( నామినేటెడ్ ): అధ్యక్షా, గౌరవ శాసనపరిషత్ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరిగారు పరమపదించడం ఎంతో బాధాకరం. వారు ఆదిలాబాద్‌లో జన్మించినా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలోని మనోవికాస్‌నగర్‌లో వారి కుటుంబసభ్యులతో నివాసముంటున్నారు. వారి పిల్లలు డాక్టర్లు. నాకు గత 6 సంవత్సరాలనుంచి ఆయనతో పరిచయం ఉంది. ఆయన పార్టీ సిద్ధాంతాలకు

ఎంతగా కట్టుబడి ఉంటారో, స్నేహానికి కూడా అంత కట్టుబడి ఉంటారు. ఆయన మేము నివసించే కంటోన్మెంట్ ఏరియాలో ఉండడం వల్ల వారానికి రెండుసార్లు మాతో ఫోనులో కూడా మాట్లాడుతూ ఉండేవారు. ఆయన కుటుంబంలో వివాహ వేడుకలకు, వారి కుమారుడు నిర్మించిన ఆసుపత్రి ఓపెనింగుకు మమ్మల్ని ఆహ్వానించడం, మేము వెళ్లడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలనుంచి వైకుంఠ ఏకాదశికి ప్రతి సంవత్సరం మేమంతా తిరుమల వెళ్లి దైవదర్శనం చేసుకుని వచ్చేవాళ్లం. ముంబాయిలో కూడా ఆయన ట్రీట్‌మెంట్ తీసుకోవడం జరిగింది. " నేను బాగానే ఉన్నా, నాకున్న వ్యాధి తగ్గిపోయింది " అని గత వారం రోజుల క్రితం ఆయన మాతో చెప్పడం, ఇంతలోనే ఆయన మరణవార్త వినడం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢసానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ బి.మోహన్‌రెడ్డి ( మెదక్, ఆదిలాబాద్, నిజామబాద్, వరంగల్ ): అధ్యక్షా, గౌరవశాసనపరిషత్ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరిగారు తెలుగుదేశం పార్టీకి చెందినవారు. ఆయన అన్ని పార్టీల సభ్యులతో కలసిమెలిసి ఉండేవారు. ఆయన నాకు చాలా సంవత్సరాల నుంచి పరిచయం ఉన్న వ్యక్తి. ఆయన మంచి స్నేహశీలి, అందరితో మంచిగా ఉండాలనుకునే తత్వాన్ని కలిగి ఉండేవారు. మొన్న మా పార్టీ సభ్యులంతా కలిసి ఆదిలాబాద్ వెళ్లడం జరిగింది. నిన్న ఉదయం వార్తాపత్రికలో ఆయన మరణించారన్న వార్తను చూసి చాలా బాధనిపించింది. "ఆయన ఒక మంచి నాయకుడని, తెలుగుదేశం పార్టీలో మంచి పేరును సంపాదించారని", ఆదిలాబాద్‌లో ఉన్న ఉపాధ్యాయులు చెప్పారు. శాసనపరిషత్తులో ఏదైనా ఆందోళన జరుగుతూ ఉంటే వెనుక సీటునుంచి వచ్చి వెల్‌లోనికి వెళ్లే దృశ్యం ఇప్పటికీ కూడా మాకు కళ్లకు కనపడుతోంది. ఆయనలా చాలా తక్కువ మంది ఉంటారు. నేను ఎప్పుడైనా చూడకుండా వెళ్లిపోతోంటే ఆపి, పిలిచి, ఆయన మాతో మాట్లాడేవారు. ఏ వ్యక్తి అయినా పార్టీకి, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడమనేది చాలా గొప్ప విషయం. ఈ శాసనపరిషత్తులో వారి స్లోగన్లు, వారి చేసిన సేవలను కొనియాడుతూ, భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

10.30am

శ్రీ బి. వేంకటేశ్వర్లు ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, పొగాకు యాదగిరి గారు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉన్నారు. గౌరవ నీయులైన నందమూరి తారక రామారావు గారు వారికి ఎమ్మెల్సీ సీటు కేటాయించడం జరిగింది. వారు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రిసెప్షన్ కమిటీ ఛైర్మన్‌గా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేవారు. పార్టీ గురించి ఏ సమాచారం కావాలన్నా వారి దగ్గరకి వెళ్లి తెలుసుకునే పరిస్థితి ఉండేది. నేను కూడా పార్టీ ఆవిర్భావం నుండి పనిచేస్తూ, అతనిని

గమనించడం జరుగుతుండేది. ప్రతి కార్యకర్త నుండి నాయకుల వరకు అందరిలో మంచి గుర్తింపు కలిగినటువంటి వ్యక్తి. రెండవ సారి శాసన మండలి వచ్చినప్పుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎమ్మెల్సీగా అతనికి అవకాశం కల్పించడం జరిగింది. వారి తరువాత రెండు సంవత్సరాలకి మేము శాసన మండలికి రావడం జరిగింది. సభలో ఏ విషయం చర్చకు వచ్చినా కూడా గట్టి నినాదాలు చేస్తూ అందరినీ ఆకర్షించగలిగే వ్యక్తి శ్రీ పొగాకు యాదగిరి. ఒక పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. అటువంటి పరిస్థితుల్లో ఈరోజు తెలుగుదేశం పార్టీలో ఆయనకు ఆ అవకాశాలు లభించాయి. బి.సి. కులానికి చెందిన వారుగా గుర్తింపు తెచ్చుకున్నారు. శ్రీ నందమూరి తారక రామారావు మరియు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి కుటుంబాలకు చాలా సన్నిహితులు. వారి ఇంట్లో మ్యారేజ్ ఫంక్షన్‌కు కూడా తమరి(ఛైర్మన్)ని తీసుకువెళ్లే బాధ్యత నా మీద పెట్టిన విషయం తమరి(ఛైర్మన్)కి తెలుసు. అలాగే శ్రీ నందమూరి తారక రామారావు మరియు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి కుటుంబ సభ్యులు మ్యారేజ్ ఫంక్షన్‌కు రావడం జరిగింది. శాసన మండలిలో కూడా చివరి వరుసలోని సీట్లో కూర్చొని మాతో ఎప్పుడూ కలిసి ఉండే వారు. ఏ విషయంలోనైనా అందరం కలిసికట్టుగా పనిచేసే వారం. ఈరోజు ఆయన మా మధ్య లేకపోవడం మాకు తీరని లోటు. వారం రోజుల క్రితమే మన సభలోకి వారు రావడం జరిగింది. అప్పటికే వారి పరిస్థితి బాగాలేదు. పత్రికల్లో కూడా గౌరవ ముఖ్యమంత్రి గారి ఛాంబర్ వద్ద కుప్పకూలిపోయారంటూ చూడడం జరిగింది. ఆ రకంగా ఈరోజు వారు లేకపోవడం మాకెంతో నష్టమని కూడా ఈ సంధర్భంగా తెలియజేసూ, వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు ఉండాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, 1982లో శ్రీ పొగాకు యాదగిరి గారితో కలిసి పని చేయడం జరిగింది. 1983లో నేను శాసన సభ్యురాలిగా ఉన్నాను. ఆయన, నేను కలిసి రెండు సంవత్సరాలు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా పని చేశాం. ఆయనకు భక్తి కూడా చాలా ఎక్కువగా ఉండేది. పార్టీకి కూడా చాలా లాయల్‌గా ఉండేవారు. తరువాత ఆయన గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా వచ్చిన కొద్ది రోజులకే శాసన మండలి రద్దయింది. శాసన మండలి రద్దయిన తరువాత ఆయన దశాబ్దంపైన పార్టీ కార్యక్రమాలకే పని చేయడం జరిగింది. పదవులు రాలేదని బాధపడకుండా పార్టీ రిసెప్షన్ కమిటీ ఛైర్మన్‌గా చాలా సిన్సియర్‌గా పని చేసే వారు. మంచి వక్త కూడా. నా ప్రక్కనే కూర్చొని ఉండే వారు కాబట్టి, గత రెండు సంవత్సరాలుగా అతనికి బాగా లేదని తెలుసు. ఆసుపత్రి వ్యవహారాలు కూడా మాట్లాడుతుండే వారు, కొద్దిగా లోన్లీగా కూడా ఫీల్ అయ్యేవారు. ఈమధ్యనే సమావేశాలప్పుడు చూసినప్పుడు కూడా అతనిలో చాలా మార్పు వచ్చినట్టుగా, చాలా ఆయాసపడుతున్నట్లుగా గమనించాను. అప్పుడే రిజిస్టర్ బుక్‌లో సంతకం కూడా చేశారు. ఛైర్మన్ గారు వెళ్లి పోయారా? అని అడుగగా, వెళ్లిపోయారని చెప్పడంతో వారి అబ్బాయి సహాయంతో అతను వెళ్లిపోవడం జరిగింది. అధ్యక్షా, ఈ సందర్భములో దళిత కవులైన శ్రీ జాలాది మరియు శ్రీ జాషువా గారు చెప్పింది ఒకటి గుర్తుకు వస్తుంది.

" కన్ను తెరిస్తే జననం – కన్ను మూస్తే మరణం", "చేతివేళ్లు కలిస్తే కళ్యాణం – కాలివేళ్లు కలిస్తే నిర్యాణం". శ్రీ పొగాకు యాదగిరి గారు నన్ను అక్క అనేవారు, నేను అతనిని అన్న అనే దానిని. ఈ సభ జరుగుతున్నప్పుడు, సిట్టింగ్ ఎమ్మెల్సీగా మరణించడం కూడా అనుకోకుండా జరిగిన సంఘటన. జాషువ గారు చెప్పేదేమిటంటే "రాజు మరణించి ఒక తార రాలిపోయె–కవి మరణించి ఒక తార గగనానికి ఎగిసే" . అలాగే "యాదగిరి మర ణించి–తెలుగుదేశంలో లీనమాయె" అలాగే "రాజు జీవించు రాతి విగ్రహమ్మై – కవి జీవించు ప్రజల నాలుకల యందు" "యాదగిరి జీవించు–నిజాయతీ యందు". నమస్కారం.

శ్రీ నారదాసు లక్ష్మణరావు ( మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ) ః అధ్యక్షా, మరణం అనివార్యమైన సందర్భంలో మరణించి జీవించువారు గొప్పవారుగా మిగిలిపోతారు. మనం ఏ ప్రాంతంలో పుడుతామో, ఏ ప్రజల మధ్య పెరిగి పెద్దవారం అవుతామో, ఆ ప్రాంతం అభివృద్ధి కోసం, ఆ ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేసిన వారు మరణించిన తరువాత కూడా జీవిస్తారు. 22 సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీలో చేరి, నాయకుని పట్ల విధేయత, ప్రజల పట్ల చిత్తశుద్ధి కలిగి అంచెలంచెలుగా ఎదిగి శాసన మండలికి ఎన్నికైన గొప్ప తెలంగాణా బిడ్డ "శ్రీ పొగాకు యాదగిరి". ఆయన మరణం బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు. తెలుగుదేశం పార్టీ కూడా ఒక గొప్ప నాయకుడిని కోల్పోయినటువంటి భావన. ఒక వ్యక్తి రాజకీయంగా ఎదగాలంటే సామాజిక నేపథ్యం అయినా కలిగి ఉండాలి, రాజకీయ నేపథ్యం అయినా కలిగి ఉండాలి లేదంటే ఆర్థిక నేపథ్యమైనా కలిగి ఉండాలి. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఒక బడుగు, బలహీన వర్గాల వ్యక్తి రాజకీయాలలో నిలద్రొక్కుకోవడమంటే అది చాలా కష్టం. రాజకీయాలలో నిలద్రొక్కుకోవాలంటే నీతి, నిజాయతీ, చిత్తశుద్ధి కావాలి, నాయకుని పట్ల విధేయత కావాలి. బడుగు, బలహీన వర్గాలకు వారసత్వాలు ఉండవు. వారి పనే, వారికి గుర్తింపు. వారి త్యాగమే, వారికి రక్షణ. ఆ రకంగా శ్రీ పొగాకు యాదగిరి గారు మంచిర్యాల ప్రాంతంలోని పేద కుటుంబంలో పుట్టి, ఆనాడు శ్రీ నందమూరి తారక రామారావు గారు ఇచ్చిన తెలుగు ప్రజల ఆత్మాభిమానం, ఆత్మ గౌరవం అనే నినాదానికి స్పందించి తెలుగుదేశం పార్టీలో చేరి తెలంగాణా ప్రాంత ప్రజలకు సేవలందించిన గొప్ప బిడ్డ. శ్రీ పొగాకు యాదగిరి గారి మరణం తీరని లోటు. శాసన మండలిలో కూడా వారి యొక్క అవగాహనను, పరిజ్ఞానాన్ని, ప్రసంగాలను పరిశీలించడం జరిగింది. విషయాల పట్ల మంచి అవగాహన కలిగి, అనేక విషయాలను సభ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారం కోసం పట్టుబట్టినటువంటి, ప్రజల పట్ల ఒక నిబద్ధత కలిగినటువంటి వ్యక్తి. శ్రీ పొగాకు యాదగిరి మరణం పట్ల తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ తరపున నేను ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారు ఈరోజు మన మధ్య లేకపోవడం విచారంగా భావిస్తూ ముగిస్తున్నాను.

ఉ.10.40

SRI SYED AMINUL HASAN JAFRI ( Local Authorities) : The demise of Sri P. Yadagiri, the Hon'ble Member of this House is quite unfortunate. He died in harness, just before his term was to complete. It is a strange coincidence that he was a Member of the previous House also and his term was cut short on abolition of Legislative Council in 1985. So on both the occasions, it is unfortunate that he could not complete his term. As a member of Telugu Desam Party, for the last 3 decades, he worked with utmost dedication and sincerity and due to these qualities, his Party entrusted him with important position and member of **TTD** Board as well as a Member of Legislative Council twice. As a Journalist, I had an occasion to interact with him for many years and he was quite pleasant personality and whenever we had an occasion to seek his help to fix up an appointment with the TDP President, he was quite accommodative and responsive. So, it is unfortunate that his death came so soon. It was only last week, when I came across him in the Assembly premises when he had come there. At that time, his condition was quite serious and that, within a few days, he passed away. I offer my condolence and the condolence on behalf of my party the All India Majlis Ittehad-Ul-Muslimeen to the bereaved family and I pray to the Almighty to rest his soul in peace. Thank you Sir.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, ప్రస్తుత సభ్యునిగా ఉండి, సహృదయుడు, మంచి వ్యక్తి అయిన శ్రీ పొగాకు యాదగిరిగారి అకాలమరణంపట్ల కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ తరపున ప్రగాఢ సంతాపం వ్యక్తపరుస్తున్నాను. ఆయన ఒక మంచి వ్యక్తి. బాబ్లీ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తూ ఆయన ఎప్పుడూ కూడా పసుపు, ఆకుపచ్చ రంగులతో మిళితమైన వస్త్రధారణతో మన కళ్ళముందు కనిపించేవారు. అలాంటి వ్యక్తి నిజంగా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, 'జాతస్యః మరణం ధృవం'. 'పుట్టినవాడు గిట్టక మానడు'. శ్రీ పొగాకు యాదగిరిగారు మరణించినప్పటికీ కూడా చిరస్మరణీయులే. రద్దయిన సభలో శాసనమండలి సభ్యులుగా ఉండి, 2007 సంవత్సరంలో శాసనమండలి పునరుద్ధరించిన తరువాత కూడా ఆయన మనందరితో కలిసిమెలిసి ఎంతో ప్రేమాభిమానాలతో, పార్టీలకు అతీతంగా, పార్టీలు వేరైనప్పటికీ కూడా తన ప్రేమలో ఏ విధమైన కల్మషం లేనటువంటి వ్యక్తి శ్రీ పొగాకు యాదగిరి. ముఖ్యంగా రైతాంగానికి సంబంధించిన సమస్యల విషయంలో ఆయన ఎప్పుడూ కూడా ముందుండేవారు. ఆయన మెడలో ఎప్పుడూ కూడా ఆకుపచ్చ రంగు కండువా వేసుకుంటూ ఉండేవారు. మీరు ఆ కండువాను ఎప్పుడూ తీయరా అని అడిగితే, రైతులకు రు.1000 మద్దతుధర లభించినపుడే నేను మెడలో ఉన్న ఈ కండువాను తీస్తాను అని చెప్పిన సందర్భాలు నాకు ఇంకా గుర్తు ఉన్నాయి. రైతులకు మద్దతుధర రు.1000 అయినప్పుడు ఆయన కండువా తీసేసారని నేను అనుకుంటున్నాను. అయినా కూడా కొన్ని

సందర్భాలలో అది మెడలో వేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ రైతాంగ సమస్యల మీద, రైతు పింఛను కోసం ఆయన చేసిన కృషి అత్యంత ప్రశంసనీయం. విద్యార్థి నాయకుడుగా కానీ, యువజన కాంగ్రెస్ నాయకుడుగా కానీ, తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఉండి శ్రీ ఎన్.టి.రామారావుగారిని, శ్రీ చంద్రబాబునాయుడు గారిని ఇద్దరినీ కూడా మెప్పించి పార్టీలో ఇతోధికమైన సేవ చేసి అందరి మన్ననలను పొంది, అందరివాడిగా జీవించి, ఈరోజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరంగా ఉంది. ఆయన ఆకస్మిక మరణం మన శాసనమండలికి తీరని లోటు. ఒక్క శాసనమండలికే కాదు తెలుగు దేశం పార్టీకి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని మరొకసారి తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేయాలని, చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వి.భూపాల్ రెడ్డి ( స్థానికసంస్థలు ) ః అధ్యక్షా, శాసనమండలి సభ్యులు శ్రీ పొగాకు యాదగిరిగారి మరణం నాకు చాలా విచారాన్ని కలిగించింది. దినపత్రికలో చూసిన తరువాత శ్రీ దాడి వీరభద్రరావుగారితో కలిసి వారి మృతదేహాన్ని చూసి వారి కుటుంబ సభ్యులను పలకరించడం జరిగింది. వారం రోజుల క్రితమే శ్రీ పొగాకు యాదగిరితో మాట్లాడినపుడు వారి ఆరోగ్యం గురించి అడిగితే, ఈ మధ్య బాగానే కోలుకున్నాననీ, అయితే కొంచెం ఇబ్బందికరంగా ఉంటోందని చెప్పడం జరిగింది. నేను కమిటీలలో పర్యటించినపుడు రెండు, మూడు సంవత్సరాల క్రితమే వారితో పరిచయం ఏర్పడింది. అప్పటినుండి ఇప్పటివరకూ ఒక స్నేహితుడుగా నెలకో, పదిహేను రోజులకో మా ఇంటికి వచ్చి కలిసేవారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేసినపుడు అతన్ని ప్రోత్సహించిన శ్రీ ఇంద్రసేనా రెడ్డిగారి దగ్గరకు వచ్చి నాకు రాజకీయంగా అసలైన గురువు మీరే, తరువాత శ్రీ ఎన్.టి.రామారావుగారు అని చెప్పడం కూడా జరిగింది. మరి వారి విధేయత అలా ఉండేది. తరువాత వారు తెలుగుదేశం నాయకుడైనా, అంతకుముందు యువజన కాంగ్రెస్‌లో పనిచేసినందువలన ఆ మాట అన్నందుకు నేను చాలా సంతోషించాను. ఎక్కడైతే పనిచేశారో అది జ్ఞాపకం పెట్టుకునే గొప్పదనం. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్య లేకపోవడం చాలా బాధకరంగా ఉంది. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ ( అసెంబ్లీ ) ః అధ్యక్షా, శ్రీ పొగాకు యాదగిరి గారు శాసనమండలి సభ్యునిగా పదవీ కాలం ముగిసే సమయానికే జీవితకాలం కూడా ముగియడమనేది కాకతాళీయమైనప్పటికీ కూడా ఈ సృష్టి వైచిత్రి మనకందరికీ బాధ కలిగించే విషయంగా నేను భావిస్తున్నాను. ముఖ్యంగా శ్రీ పొగాకు యాదగిరి గారు తాను నమ్మిన సిద్ధాంతం కోసం తాను ఉన్నటువంటి రాజకీయ పార్టీలో ముక్కుకు సూటిగా నిబద్ధతతో వ్యవహరించిన వ్యక్తి అని మనందరికీ

తెలుసు. అదరితో కలివిడిగా ఉంటూ సమస్య వచ్చినపుడు దానిమీద స్పందిస్తూ నిర్భయంగా మాట్లాడే వ్యక్తిగా మెలిగిన శ్రీ యాదగిరిగారు లేరనే మాట చాలా బాధ కలిగించే విషయం. నిన్న పత్రికలలో ఆయన వయసు 65 సంవత్సరాలని రాశారు. కానీ నిజానికి ఆయన 65 సంవత్సరాల వయసు వారిగా ఎప్పుడూ కనబడలేదు. ఆయన చాలా ఆరోగ్యంగా, ఆనందంగా తిరుగుతుండేవారు. ఇప్పుడు ఒక మిత్రులు ఆయన పేరును ఉచ్చరిస్తూ యాద్‌గిరి అని పలికారు. అది విన్న నాకు ఆయన చనిపోయినప్పటికీ నిజంగానే మన మనసులో ఉండిపోతారనే భావన కలిగింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలనీ, ఆయన కుటుంబ సభ్యులకు మనోస్థైర్యం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పోట్ల నాగేశ్వర్ రావు ( స్థానికసంస్థలు ) ః అధ్యక్షా, మిత్రుడు శ్రీ పోగాకు యాదగిరిగారు తెలుగుదేశం పార్టీకి, పార్టీ సభ్యులందరికీ ఒక ఆప్తుడు. వారు ఒక నిరుపేద, బలహీన వర్గం నుండి వచ్చారు. ఆనాడు శ్రీ ఎన్.టి.రామారావుగారు ఉన్నపుడు, తరువాత శ్రీ చంద్రబాబునాయుడుగారి హయాములో ఆయన ఈ సభకు సభ్యుడుగా ఎన్నికవడం మా పార్టీ వారికిచ్చినటువంటి గుర్తింపు. మా పార్టీలో ఒక నిజాయితీ కలిగిన కార్యకర్తగా, బలహీనవర్గానికి చెందిన కార్యకర్తగా ఏ ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా పార్టీలో గుర్తింపు పొందినటువంటి వ్యక్తి అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆయన మన సభలో ఉన్నంత కాలం వారు ఇచ్చినటువంటి సేవలు మిత్రులందరూ కూడా ఉటంకించారు. ఒక ఆప్తుడిని, మిత్రుడిని కోల్పోయినందుకు నిజంగా చాలా బాధంగా ఉంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలనీ, వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ. 10.50

శ్రీ చిగురుపాటి వరప్రసాద్ ( కృష్ణా, గుంటూరు ) ః అధ్యక్షా, పోగాకు యాదగిరి గారి మరణం చాలా బాధాకరం. మనందరికీ సహచర సభ్యుడిగా ఉన్న అనుబంధంతోపాటు, ఆయన ఆరు సంవత్సరాల పాటు నా ప్రక్క సీటే ఆయనది. ఆయనది లాస్ట్ సీటు, ఆ తరువాత సీటు నాది. సభలో జరుగుతున్న విషయాలను అన్నింటిని ఎప్పుడైనా నేను ఆలశ్యంగా వస్తే, ఆయన నాకు చెప్పడం, ఆయన ఆలశ్యంగా వస్తే, నేను చెప్పడం జరుగుతూ ఉండేది. గత అనుభవాలను ఆయన దృష్టిలో ఉంచుకుని, మధ్యమధ్యలో నాకు ప్రోత్సాహం ఇవ్వడం, నేను ఎప్పుడైనా ఏ విషయాలను అయినా నోట్ చేసుకుంటే, ఆయన మీరు ఉపాధ్యాయుడిగా, విద్యార్థిలాగా అన్నీ భలే నోట్ చేసుకుంటున్నారని నన్ను ప్రోత్సహించడం, ఇప్పటికీ నా కళ్ళముందు మెదులుతోంది. ప్రతిపక్ష పార్టీలో మంచిగా మాట్లాడగలిగిన వ్యక్తి, సభలో అందరి ఎటెన్షన్‌ను డ్రా చేయగలిగిన వ్యక్తి ఆయన. కొంచెం ఎప్పుడైనా ఆయన ఆలశ్యంగా వస్తుంటే నేను ఎదురుచూస్తుండేవాడిని. ఈ ఆరు సంవత్సరాలు కేవలం ఈ కొద్ది కాలం ముందు తప్ప, సభలో పూర్తి కాలం ఆయనతో కలిసి పనిచేసిన వ్యక్తిని నేను. సహచర సభ్యులతోనూ, మీ అందరితోనూ

పాలుపంచుకుంటూ, చిన్నప్పుడు ఒక బెంచ్‌మేట్‌ను కనుక మిస్ అయితే ఎంత బాధగా ఉంటుందో, ఆ రకమైన బాధను నేను ఫీల్ అవుతున్నాను. అంతేగాకుండా, వారి గొంతు, వారి నిజాయితీయే వారికి పెద్ద ఎస్సెట్. ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క ఎస్సెట్ ఉంటుంది. భగవంతుడు వారికి ఇచ్చిన ఎస్సెట్టే వారి గొంతు, నిజాయితీ, వారికి బలహీన వర్గాల ప్రతినిధిగా, తెలుగుదేశం పార్టీ నాయకుడిగా వారికి ఆ గొంతు ఒక ఎస్సెట్‌గా మేము ఫీల్ అయ్యాము. వారు లేని లోటును వారి కుటుంబ సభ్యులు తొందరగా ఆ షాక్ నుంచి కోలుకోవాలని, ఆ భగవంతుడు ఆయన కుటుంబానికి మేలు చేయాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ అంగర రామ మోహన్ ( స్థానికసంస్థలు ) ః అధ్యక్షా, పొగాకు యాదగిరి గారి మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు. ఆయన పార్టీలో ఒక సామాన్యుడిగా మెలిగి, రెండుసార్లు ఎం.ఎల్.సి.గా రావడం చాలా గొప్ప విషయం. తెలుగుదేశం పార్టీలో వెనుకబడిన వర్గాలకు, సామాన్యులకు అవకాశం వస్తుంది అనడానికి ఆయనే నిదర్శనం. ఆయన రిసెప్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నా, చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతూ ఉండేవారు. నేను కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు ఎక్కువగా ఆయన దగ్గర కూర్చునేవాడిని. ఆయన విజిటర్స్‌ను కూడా తప్పనిసరిగా రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్ళమని చెప్పేవారు. ఆయన చాలా క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. యాదగిరిగారు అంత సామాన్యునిగా రెండవసారి కూడా శాసనమండలికి రావడం చాలా గొప్ప విషయం. ఈ రోజున 20 సంవత్సరాలు మంత్రిగా చేసిన వారు కూడా ఎం.ఎల్.సి స్థానానికి పోటీ పడుతున్నారు. ఒక్కొక్క సందర్భంలో కొంతమంది సభ్యులు ఆ పదవి కోసం సుమారు రూ.7 కోట్లు, రూ.9కోట్లు ఖర్చు పెడుతున్నారని చెబుతుంటే, సామాన్యునిగా ఉన్న వ్యక్తి పొగాకు యాదగిరి లాంటి వారు మళ్ళీ శాసనమండలికి వస్తారా, మాలాంటి వాళ్ళు శాసనమండలికి రాగలమా అనేది అప్పుడప్పుడు నాకు ఆందోళన కలుగుతూ ఉంటుంది. ఏది ఏమైనా, పొగాకు యాదగిరిగారి మరణం తెలుగుదేశం పార్టీకి, ఈ శాసన మండలికి కూడా తీరని లోటు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

డా. పి.వి. రంగారావు ( నామినేటెడ్ ) ః అధ్యక్షా, కొంతకాలంగా నా గొంతు నాకే వినపడడం లేదు. గొంతు సరిగ్గా వినపడకపోతే, ఎంత కష్టం ఉంటుందో స్వర్గీయ శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, పృథ్వీ రాజ్ కపూర్ ఎంత బాధపడ్డారో నాకు తెలుసు. ఈ రోజు పొగాకు యాదగిరి గారు ఒక దృక్కోణం నుంచి చూస్తే చాలా అదృష్టవంతుడు. ఎందుకంటే, సిటింగ్ ఎం.ఎల్.సి.గా అధికారంలో ఉండి చనిపోవడం కూడా ఒక అదృష్టంగా భావిస్తున్నాను. అనామకుడిగా మాత్రమే కాకుండా, ఒక ఎం.ఎల్.సి.గా ప్రజాసేవ చేస్తూ, ప్రజా సేవలో మరణించడమనేది భగవంతుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాను. డా.అక్కినేని నాగేశ్వరరావుగారు ఒక మాట చెపుతారు, ఆయన చివరి కోరిక ఏమిటంటే,

నటిస్తూ, నటిస్తూనే మరణించాలని అన్నారు. శ్రీ పొగాకు యాదగిరి ప్రతిపక్షంలో ఉన్నా, చాలా ఆప్యాయంగా, ప్రేమగా, గౌరవంగా మాతో మాట్లాడి అనేక విషయాలను మమ్మల్ని అడిగి తెలుసుకునేవారు. ఒక ప్రక్క మేము మాట్లాడలేకపోతున్నాము, మౌనంగా ఉండవలసిన అవసరం వచ్చింది, అయినప్పటికీ, ఆయన మమ్మల్ని అడిగి అనేక విషయాలు వివరంగా చెప్పించుకునే వారు. అలాంటి వారు అకస్మాత్తుగా మరణించారు. నిన్న టి.వి.లో స్క్రోలింగ్ చూశాను, చాలా బాధ కలిగింది. ఎందుకంటే, అంతకు ముందే ఆయన నాతో ఒక అంశంపై చాలా వివరంగా చర్చించారు. ఆ చర్చలో నేను చాలా నిష్కర్షగా మీరు తీసుకుంటున్న చర్య అంత మంచిది కాదని చెప్పాను. అయినా, ఆయన నాతో స్నేహాన్ని విడవకుండా, ఏ మాత్రం పట్టించుకోకుండా, నా మాటను మన్నించి ఆయన నాతో మాట్లాడడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. అలాంటి మంచి మనిషి, సహృదయుడు ఆయన. మనం ఎవరినైనా విమర్శిస్తే, ఎదుటి వాళ్లు మనల్ని శత్రువులుగా పరిగణిస్తారు. కానీ, పొగాకు యాదగిరి గారు ఆయన విమర్శిస్తే, ఒక స్నేహితుడిగా భావించి, ఎదుటి వారి నుంచి మంచిని, సలహాలను తీసుకుని, ఆచరించడానికే ప్రయత్నిస్తారు. అలాంటి మంచి మనిషి, ప్రజాసేవకుడు అయిన పొగాకు యాదగిరి మరణానికి నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి కూడా భగవంతుడు ధైర్యాన్ని, మనోస్థైర్యాన్ని, శాంతిని కలుగచేయాలని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.వి.వి. సత్యనారాయణ రాజు ( తూర్పు, పశ్చిమగోదావరి )ః అధ్యక్షా, రెండవసారి పొగాకు యాదగిరి గారు శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన తరువాత ఆయన పదవీకాలం ఇంకా ఉండగానే 6 సంవత్సరాల కాలంలో ఆయన మరణించడం అనేది చాలా బాధాకరం. ఆయన నాకు చాలా కావలసిన వ్యక్తి కూడా. రెండు, మూడు నెలలకు ఒకసారి వాళ్ళ అబ్బాయిని కూడా తీసుకువచ్చి, వాళ్ళ భవిష్యత్తును గురించి కూడా చర్చించి, మాట్లాడేవారు. నీతికి, నిజాయితీకి, నిబద్ధతకి నిలబడేవారు ఆయన. ఆయన ఆర్థికంగా చాలా కష్టాలు పడ్డారనే అంశాన్ని ఈ సభ దృష్టికి తీసుకువస్తూ, ప్రభుత్వం దయచేసి ఈ సభలో ఆయనకు సంతాపం చెప్పడమే కాకుండా, వారు బడుగు, పేద, బి.సి. కమ్యూనిటీ నుంచి వచ్చిన వ్యక్తిగా ఆయన కుమారులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, వారి కుటుంబాన్ని కొంత ఆర్థికంగా ఆదుకుంటే, ఆయన ఆత్మకు నిజమైన శాంతి చేకూరుతుందని తమ ద్వారా కోరుకుంటూ, పెద్దలు, గౌరవ మంత్రివర్యులు మీరందరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తూ, పొగాకు యాదగిరి గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జూపూడి ప్రభాకర రావు ( నామినేటెడ్ ) ః అధ్యక్షా, బాధాకరమైనటువంటి అంశం. మనలో ఒకరిగా ఉన్నటువంటి పొగాకు యాదగిరి గారు నాలుగురోజుల క్రితమే మనందరితో మాట్లాడి, కౌన్సిల్‌లో ఉండి, ఈ విధంగా మరణించడం బాధాకరం. ఏదిఏమైనా, మా లాంటి క్రొత్త వారికి ఒక స్ఫూర్తిగా,

అనేకమైన అంశాలను, మనం ఒక్కొక్కసారి సభలో నవ్వినప్పటికీ కూడా ఆయన ప్రజా సమస్యలను చాలా సీరియస్‌గా తీసుకుని, ఆ మూలనుంచి మాట్లాడిన యాదగిరి గారు ఈ రోజున అక్కడ లేకపోవడం, వారికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఏ పార్టీ అయినప్పటికీ కూడా ఆయన ప్రజాసమస్యల మీద నిరంతరం తన వాక్కుతో తెలియజేస్తూ, ఆయన పదవీ కాలం పూర్తవుతున్నప్పటికీ కూడా పదవి లేకపోతే ఆ వచ్చే కష్టాన్ని కూడా భరించలేక ఆయన పదవిలో ఉండగానే, భగవంతుడు ఆయనను తీసుకువెళ్ళడం తీవ్రమైన బాధే అయినప్పటికీ, నిజాయితీగా ఆయన ప్రజలకోసం పాటుపడ్డ వ్యక్తి. పేదరికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారి కుటుంబానికి ప్రభుత్వం కానీ, ఆయన పని చేసిన రాజకీయ పార్టీ కానీ, ఆ కుటుంబానికి అండగా ఉండాలని, మీ ద్వారా కోరుకుంటూ, ఆయన అకాల మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

***ఉ.11.00***

శ్రీ నేతి విద్యాసాగర్ ( స్థానికసంస్థలు ): అధ్యక్షా, మన సహచర ఎం.ఎల్.సి శ్రీ పోగాకు యాదగిరిగారి మరణానికి చింతిస్తున్నాము. ఒక బడుగు బలహీన వర్గాల నాయకుడిగా, ఆ కుంటుంబానికి శానస పరిషత్తునుంచి ఒక తీర్మానము పెట్టి, వారి కుమారునికి ఉద్యోగం ఇప్పించడానికి మనందరం కూడా సహకరించాలని కోరుకుంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి పుల్లా పద్మావతి ( అసెంబ్లీ ) : అధ్యక్షా! మనసు చాలా కష్టంగా ఉంది. యాదగిరిగారు అంటే కొత్తగా ఉంది. ఎప్పుడూ యాదగిరి అన్నా అని పిలిచేవాళ్ళం. ఏ సందర్భంలోనైనా మా గొంత గట్టిగా వినిపిస్తే, బయటకు వెళ్ళిన తరువాత, అమ్మా పద్మమ్మా గట్టిగా మాట్లాడతావా, మమ్మల్ని మాట్లాడనీయవా అని అంటూనే, ఇంకొక ప్రక్క ఎంకరేజ్ చేస్తూ, మనం ఇలానే ఉండాలి, ఇలాగుంటేనే మనం రాజకీయాల్లో నిలబడతాము అని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. నిజాయితీగా ఉన్నావు, ఇలానే వెళ్ళు అని ఒక సందర్భంలో ఆయన నాతో చెప్పడం జరిగింది. మనం మెదడుతో ఆలోచించము, మనసుతో ఆలోచిస్తాము కాబట్టి కొన్ని పొరపాట్లు జరుగుతాయని పార్టీలు వేరు అయినా ప్రక్కన కూర్చోపెట్టి చెప్పేవారు. ఆయన మాటల్లో ఆత్మీయత, నిజాయితీ కనిపిస్తూ ఉండేది. ఇలాంటి మంచి వారు ఇంకా కొంత కాలం ఉంటే సమాజానికి మేలుజరిగేది. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

## <u>సంతాప తీర్మానము:</u>

ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు సభ్యులు శ్రీ పొగాకు యాదగిరి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. శ్రీ పొగాకు యాదగిరి గారు 1949వ సంవత్సరం ఏప్రిల్, 14వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో జన్మించారు. వీరు శాసన సభ నియోజక వర్గం ద్వారా 2007వ సంవత్సరంలో శాసన పరిషత్తు సభ్యునిగా ఎన్నిక అయినారు. వీరు శాసన పరిషత్తు ప్రభుత్వ హామీల సమితికి సభ్యులుగానూ, సభా సమక్షంలో ఉంచే పత్రాల సమితి, నైతిక విలువలు సమితి, శాసన సభ ఉప షెడ్యూల్ సమితులకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండి వారి సేవలను అందించారు. వీరు వృత్తిరీత్యా న్యాయవాది. 1980-84 సంవత్సరాలలో శాసన పరిషత్తు సభ్యునిగా ఎన్నికైనారు. వీరు తిరుమల తిరుపతి దేవస్థానం మరియు అధికార భాషా సభ్యులుగా సేవలు అందించారు. శాసన పరిషత్తు రెండవ సారి ఏర్పడిన తరువాత తెలుగుదేశం పార్టీ తరఫున ఎం.ఎల్.సిగా రావడం జరిగింది. వీరు ఆరు సంవత్సరాలు సేవ చేశారు. ప్రజా సమస్యలను నిర్భయంగా సభలో మాట్లాడేవారు. సమస్యల పరిష్కారంలో అందరితోకలిసి పనిచేసే స్వభావం ఆయనలో ఉంది. నిన్న నేను వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. వారి సతీమణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, ఇతర బంధుమిత్రులు శోక సముద్రంలో మునిగిపోయి ఉన్నారు. ఇంత సుదీర్ఘమైన రాజకీయ జీవితం ఉన్నప్పటికీ, నేటికినీ తిరుమలగిరిలో ఒక ఫ్లాట్‌లో ఆయన నివసిస్తున్నారు. చాలా ఆదర్శమైన నిజాయితీతో కూడిన విలువైన జీవితాన్ని ఆయన ఏర్పాటుచేసుకున్నారు. వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తరువాత చర్యలు తీసుకుంటాము. శ్రీ పొగాకు యాదగిరి గారు 2013వ సంవత్సరం 23.03.13వ తేదీన మరణించారు. వీరి వయస్సు నేటికి 64 సంవత్సరాలు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్ధిస్తూ, మనందరం రెండు నిమిషాలు మౌనం పాటిద్దాము.

(సభలోని సభ్యులందరూ తమ తమ స్థానాలలో లేచి నిలబడి మౌనం పాటించారు)

MR CHAIRMAN : Now, the House is adjourned to meet again tomorrow i.e., on 26.03.2013 at 10.00 a.m.

(The House then adjourned at 11.06 a.m.)

***